క్లుప్తంగా

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పెద్దాపురం డీఎల్‌పీఓ బాలమణి అధికారులకు సూచించారు. మండలంలోని ధర్మవరంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ మురుగునీటి కాలువల్లో చెద్దా చెదారం తొలగించడం, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెత్త కుప్పలను డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కాశీవిశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

జీయన్న మఠంలో అన్నసమారాధన



చిల్లంగి అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలిపారు. దాతల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్నదానంలో గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించారు. తొలుత భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసానగరంలో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిల్లంగి గ్రామానికి చెందిన సంపర సుధాకర శ్రీవినాయక్ వర్మ ఆర్థిక సాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తిమ్మరాజుచెరువుకు ఏలేరు జలాలు



ఏలేరు ప్రాజెక్టు గేట్ల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు ప్రాజెక్టు నుంచి శనివారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తిమ్మరాజుచెరువుకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తి నీటిని వదిలారు. తొలుత ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ సాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బసా వీరబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం

తొండంగి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చాత్రాతి వి.సత్యనారాయణ అన్నారు. జెడ్పీ హైస్కూల్లో శనివారం మనం–వనం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, కెనరా బ్యాంకు మేనేజర్ ఎ.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

2 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్, కాకినాడ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా కిర్లంపూడి మండలం కృష్ణవరం, ఏలేశ్వరం మండలం అప్పనపాలెం గ్రామాల్లోని సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. కృష్ణవరంలో 1,400 లీటర్లు, అప్పనపాలెంలో 600 లీటర్లు సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అప్పనపాలెంలో ఉగ్గిన నాగుపై పరారీ కేసు నమోదు చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కూటమి సర్కారు మోసాలను వివరించండి
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- తునిలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

తుని: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కార్యకర్తలకు సూచించారు. తుని సాయి వేదికలో శనివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ అధ్యక్షతన జరిగింది. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు డీవీ సూర్యనారాయణరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా పదునైన పదజాలంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. ప్రభుత్వం మెడలు వంచైనా పేదలకు సంక్షేమ పథకాలు అందించే వరకూ రాజీలేని పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలు, తుని పట్టణం నుంచి అశేష సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి రావడంతో సాయివేదిక కిక్కిరిసిపోయింది. దాడిశెట్టి రాజా మాట్లాడుతున్నంత సేపు జై జగన్, జై రాజా నినాదాలతో సమావేశపు హాలు హోరెత్తింది. ఎన్నికల సమయంలో యనమల రామకృష్ణుడు కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి జాకెట్టు ముక్క, రూ.200 నోటు, సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ను ఇచ్చి ఓట్లు అభ్యర్థించారని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులకు ఏ పని చేయవద్దని చెప్పడం పెద్దరికం అనిపించుకోదని చురకలు అంటించారు.



దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దాడిశెట్టి రాజా



పార్లమెంటరీ పరిశీలకుడు సూర్యనారాయణ రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజా

ప్రజలకు అందని వైద్య సేవలు

తుని ఏరియా ఆసుపత్రిలో మందులు, వైద్యుల కొరత ఉన్నా పట్టించుకోలేదన్నారు. గతంలో 104 ద్వారా గ్రామాలకు వైద్య సేవలు అందేవని, ఇప్పుడు అధ్వానంగా ఉందన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు సూర్య నారాయణరాజు మాట్లాడుతూ తునిలో కార్యకర్తలు చాలా ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యాలపై సమర శంఖం పూరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు, లాలం బాబ్జి, పురుషోత్తం గంగా భవానీ, ఎంపీపీ లగుడు శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకట బెనర్జీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లంక కృపానందం, రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శి మడదా హేమంత్, కల్చరల్ వింగ్ ఉపాధ్యక్షుడు మురాలశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర క్రిష్టియన్, మైనార్టీ సెల్ కార్యదర్శి నక్కా జాన్ ఆనంద్, తుని, తొండంగి, కోటనందూరు, తుని పట్టణ కన్వీనర్లు దుంగల నాగేశ్వరరావు, బత్తుల వీరబాబు, చింతకాయల చినబాబు, మర్నీడి శ్రీను, రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి రేలంగి రమణాగౌడ్, తుని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అంగుళూరి సుశీల రాణి, పోతల రమణ, సకురు నాగేంద్ర నెహ్రూ, కొయ్యా మురళీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కిర్లంపూడిలో వనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న పద్మనాభం, గిరిబాబు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు(పీఏసీ) ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం స్థానిక వనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయనతో పాటు పెంటకోట నాగబాబు, ఆలయ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని వెంగాయ్యమ్మపురం శివారులో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5050 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 122 కేసుల పరిష్కారం

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో జగ్గంపేట పోలీసు స్టేషన్‌కు చెందిన 122 కేసులు పరిష్కరించినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన నాయకులతో దాడిశెట్టి రాజా

తుని: కూటమి పాలనపై విసుగు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. తుని సాయివేదికలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో తుని మండలం డి.పోలవరానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ, వైస్ ఎంపీపీ చిటికెల సత్యవతి, తుని మండల కార్యదర్శి అంకంరెడ్డి దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన మాజీ ఉపాధ్యక్షుడు అంకంరెడ్డి తాతీయులు, టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త ఆశిన ప్రసాద్, గంగవరపు వెంకటేష్, బర్ల కామరాజు యాదవ్ వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరడానికి సిద్ధం ఉన్నారని రాజా అన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దు

- ఏపీ సాధు సమితి పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీ స్వామీజీ



మల్లేపల్లి హోటల్‌లో స్వామివారి ఆనంద నిలయం నమూనాను పరిశీలిస్తున్న స్వామీజీ

గండేపల్లి: వ్యాపార సముదాయాల్లో హిందువుల మనోభావాలకు అపకీర్తి తెచ్చేవిధంగా ఆనంద నిలయం నమూనాలు ఏర్పాటు చేయడం సరికాదని విశాఖ ఏపీ సాధు సమితి పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో హైవేను ఆనుకుని ఉన్న ఓ హోటల్‌లో యాజమాన్యం ఏర్పాటు చేసిన తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆనంద నిలయం నమూనాను శనివారం ఆయనతో పాటు తురగా శ్రీరాం, సుబ్రహ్మణ్యస్వామి, సన్యాసేశ్వర స్వామి, మురళీస్వామి, సుధా స్వామి, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామికి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారన్నారు. ఆయనపై నమ్మకంతో వ్యాపార, వాణిజ్య రంగాల్లో స్వామివారి ఫొటోలు పెట్టుకుంటారని, నమూనాలు ఏర్పాటు చేసి హిందువుల మనోభావాలకు అపకీర్తి రానియొద్దని పేర్కొన్నారు. ఆనంద నిలయ ద్వారాల సెట్టింగ్ ఇప్పటికే భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆనంద నిలయ నమూనాను తక్షణమే తొలగించి స్వామివారి ఫొటో ఏర్పాటు చేసుకోవాలని హోటల్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆయన చొరవ తీసుకోవాలని కోరారు. హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆనంద నిలయం సెట్టింగ్ తొలగింపునకు మూడు రోజులు గడువు ఇస్తున్నట్టు తెలిపారు. అప్పటికీ తొలగించని పక్షంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హోటల్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

- మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తోట నరసింహం



తోట నరసింహం (ఫైల్)

గోకవరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగ్గంపేట నియోజకవర్గంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి తోట నరసింహం తెలిపారు. మాజీ మంత్రి, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, కాకినాడ పార్లమెంటరీ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. జగ్గంపేట శివారున గోకవరం రోడ్డులోని బాలాజీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి ?



సమావేశంలో మాట్లాడుతున్న పాటంశెట్టి

కిర్లంపూడి: ఎన్నికల హామీలు (వాగ్దానాలు) ఏమయ్యాయని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని బూరుగుపూడిలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమమైందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని గొప్పలు చెప్పుకుంటూ సాగునీరు అందించడం లేదన్నారు. తాళ్లూరు లిఫ్ట్ పరిధిలోని 42 వేల ఎకరాల ఆయకట్టు రైతుల దుస్థితిని పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. లిఫ్ట్ ఆయకట్టులో సుమారు 30 వేల ఎకరాలకు సాగు నీరు అందక రైతులు అప్పులు పాలయ్యారని, అటువంటి పరిస్థితి మళ్లీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే వచ్చిందని దుయ్యబట్టారు.

సత్యదేవుని దర్శించిన మాజీ ఎమ్మెల్యే ‘వరుపుల’



సత్యదేవుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు దంపతులు

అన్నవరం: ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, వేంకటలక్ష్మి దంపతులు శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందించి స్వామి వారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు బలువు రాంబాబు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో రెండోరోజు శనివారం ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 11వ పీఆర్సీలో ఉన్న 24 నెలల బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీపై కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించే 1/2009 సర్క్యులర్‌ను యథావిధిగా అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో తోట గంగారావు, ఎల్ఎస్ రావు, జీఎస్ నారాయణ, ఎల్‌వీఎస్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

318 కేసుల పరిష్కారం

ప్రత్తిపాడు: రాజీ మార్గమే రాచమార్గమని, కక్షిదారులు లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకుని సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ సూచించారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన ప్రసంగించారు. లోక్ అదాలత్ తీర్పే అంతిమ తీర్పు అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 318 కేసులను న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ పరిష్కరించారు. ఏపీపీ పి.రవీంద్రబాబు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ బుగత శివ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, లోక్ అధాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి ఆశయ సాధనకు కృషి చేయాలి



మోహనరంగా విగ్రహ ఆవిష్కరణలో మాట్లాడుతున్న వంగవీటి రాధ

తొండంగి: పేదల పక్షాన పోరాడి సామాన్యులకు అండగా నిలిచిన వంగవీటి మోహన్‌రంగా ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఆయన తనయుడు వంగవీటి రాధ అన్నారు. శనివారం రాత్రి తొండంగి మండలం పైడికొండ పంచాయతీ ఆనూరు గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ మోహన్‌రంగా సమాజంలో పేదలకు కష్టాల్లో అండగా నిలబడి సహాయాన్ని అందించారన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెటి రాజా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జక్కంపూడి గణేష్ తదితరులు వంగవీటి మోహన్‌రంగా చేసిన సేవలను కొనియాడారు.

అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ భక్తులైన 63 మంది నాయనార్లతో పాటు దక్షిణామూర్తి, లక్ష్మీహయగ్రీవుడు, సూర్యభగవానుడు, కాలభైరవుడు, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు తీర్థ సంగ్రహణం, అగ్నిసంగ్రహణం, దిశాహోమం, శాంతిహోమం, మూర్తి హోమం, ప్రవేశబలి వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణాసేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద, ఆధ్యాత్మిక వేత్త అరుణాచల మాధవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఈగల విజయ దుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ నాయకులు



తునిలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని నినాదాలు చేస్తున్న లిబరేషన్ నాయకులు

ఏలేశ్వరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో శనివారం ర్యాలీ చేశారు. ఆల్ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను కేంద్రం రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. లేబర్‌కోడ్‌లతో కార్మికులు తీవ్రనష్టపోయారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలపై చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు సత్యనారాయణ, ఏగుపాటి అర్జునరావు, నాగమణి, రత్నం,నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తుని: ఈ నెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు కోరారు. పట్టణంలోని షాదీఖానాలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. తుని మండలం కుమ్మరిలోవలో దళితుల సాగులో ఉన్న భూదాన భూమిని దళితులకే కేటాయించాలన్నారు. ఇతరులు వీటి జోలికి వస్తే తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు జనార్దన్, జి.సింహాచలం, బోడపాటి నాగమణి, నూకరాజు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, పంచాయతీ కార్మిక సంఘాల నాయకులు అల్లాడి లక్ష్మి, గనిలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవేణి, వరలక్ష్మి, అనంతలక్ష్మి, పోసపల్లి రమణ, జి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కౌలు కార్డులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జగ్గంపేట: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీ గరిమెళ్ల శ్రీనివాస్ సూచించారు. గ్రామంలోని మర్రి మొక్క వీధితో పాటు పలు ప్రాంతాల్లో రైతులకు శనివారం కౌలు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు కార్డుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కౌలు రైతులు రుణాలు పొందాలంటే కౌలు రైతు కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట వ్యవసాయ అధికారి నరసింహం, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 729 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో వికాస, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 1206 మంది హాజరయ్యారు. వీరిలో 729 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు వికాస పీడీ లక్ష్మణరావు తెలిపారు. వివిధ కేటగిరీలకు చెందిన 33 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని అర్హత కలిగిన వారిని ఎంపిక చేశారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియామక పత్రాలు అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జె.నవీన్ పాల్గొన్నారు.